సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



పనులు పూర్తి చేయాలి

సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు.

- 8లో ▸



సర్వేకు సహకరించాలి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కోరారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.6 /17.9

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కాళేశ్వరం దేవస్థానానికి ప్రత్యేక బస్సు సర్వీస్

కామారెడ్డి టౌన్: కార్తీక మాసం సందర్భంగా కాళేశ్వరం దేవస్థానానికి ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సు సర్వీస్‌ను నడుపుతున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. కామారెడ్డి బస్ డిపో నుంచి ప్రతి ఆదివారం ఉదయం 7 గంటలకు ఎక్స్‌ప్రెస్ బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. వేములవాడ, కరీంనగర్, మంథని మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు కాళేశ్వరం చేరుకుంటుందని, అక్కడి నుంచి సాయంత్రం 4 గంటలకు తిరుగు ప్రయాణమవుతుందని తెలిపారు. టికెట్టు ధర పెద్దలకు రూ. 320, పిల్లలకు రూ. 160 అని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'సమస్యలను పరిష్కరిస్తాం'



భిక్కనూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీకి సంబంధించిన అద్దె దుకాణాలలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు హామీ ఇచ్చారు. గురువారం భిక్కనూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ దుకాణాల అద్దె నిర్ణయంపై సమావేశం నిర్వహించారు. తమకు కేటాయించిన అద్దె దుకాణాలలో కనీస సౌకర్యాలు లేవని, వర్షం కురిస్తే స్లాబ్ నుంచి నీరు లీకవుతోందని దుకాణాల నిర్వాహకులు డీపీవోతో పేర్కొన్నారు. 23 అద్దె దుకాణాలకుగాను రోడ్డు పక్కన ఉన్న వాటికి నెలకు రూ. 2 వేలు, లోపలివాటికి నెలకు వేయి రూపాయలనుంచి రూ. 1,500 వరకు అద్దె చెల్లించాలని డీపీవో సూచించగా.. అంత అద్దె చెల్లించలేమని దుకాణాదారులు పేర్కొన్నారు. అద్దె తగ్గించాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని డీపీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, పంచాయతీ ఈవో మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర జట్టుకు ఎంపిక



కామారెడ్డి రూరల్: జాతీయ స్థాయి అండర్-17 బాలికల హాకీ టోర్నమెంట్‌కు గర్గుల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాణబోయిన ప్రవళిక, కమ్మరి భవాని ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ హైస్కూల్‌లో ఈనెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో సత్తా చాటడంతో వీరిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి హర్యానాలో జరిగే హాకీ టోర్నీలో వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు దెగ్లూర్‌కు పవన్ కల్యాణ్ రాక


మద్నూర్(జుక్కల్): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం మండలానికి సరిహద్దుల్లో గల మహారాష్ట్రలోని దెగ్లూర్ పట్టణానికి రానున్నారు. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ మండల నాయకులు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు దెగ్లూర్‌లోని చిద్రవార్ ఫ్యాక్టరీలో నిర్వహించే కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొంటారన్నారు.

'రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతున్నాయి'

కామారెడ్డి క్రైం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రిజిస్ట్రేషన్ సేవలు నిలిపివేసినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిజామాబాద్ డీఐజీ రమేశ్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన తెలిపారు. ఈ విషయమై వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు అందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది ఎలాంటి బంద్ పాటించడం లేదని స్పష్టం చేశారు. కొందరు దస్తావేజు లేకరులు మాత్రమే సేవలు నిలిపివేశారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నేరుగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించి యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందాలని సూచించారు.

స్టేషన్ బెయిల్.. కేసుకో లెక్క!

- పలు ఠాణాలలో బేరసారాలు
- అడిగినంత ఇవ్వకుంటే వేధింపులు
- ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం.. ఏదైనా ఆపద ఎదురైనప్పుడు పోలీసులు మంచి చేస్తారన్న భరోసా ప్రజలలో ఉంటాయి. వ్యవస్థపై, చట్టాలపై ఉన్న గౌరవం అలాంటిది. అయితే 'కొందరు' పోలీస్ అధికారులు చిన్నదానికి పెద్దదానికి కేసులు నమోదు చేయడం, ఇరువైపులా దండుకోవడం అలవాటుగా మార్చుకున్నారు. కొన్నిచోట్ల అయితే కేసుకో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. స్టేషన్ ఆఫీసర్‌కు ఇంత, కింది సిబ్బందికి ఇంత.. అంటూ లెక్కలు గట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలా కొందరు వ్యవహరిస్తున్న తీరు పోలీసు శాఖకు మచ్చ తెచ్చి పెడుతోంది.

ఎస్పీ సింధు శర్మ పోలీస్ అధికారులతో నెల నెలా నిర్వహించే సమావేశాల్లో కేసుల నమోదు, పరిశోధన విషయంలో పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. అవినీతితో పాటు ఇతర ఆరోపణలు వచ్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేసే ఓ డీఎస్పీ తక్కువ డబ్బులకు ఎక్కువ బంగారం ఇప్పిస్తానని ఓ రిటైర్డ్ ఉద్యోగిని నమ్మబలికి రూ.17 లక్షలకుపైగా కాజేసిన విషయాన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. డీఎస్పీపై కేసు నమోదు చేయించడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో ఉన్నతాధికారులు ఆ డీఎస్పీని సస్పెండ్ చేశారు. ఈ సంఘటన మరువకముందే బాన్సువాడ నియోజకవర్గంలోని నిజామాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే వర్ని ఎస్సై లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. తాజాగా లింగంపేట ఎస్సై అరుణ్‌కుమార్, స్టేషన్ రైటర్ రామస్వామి స్టేషన్ బెయిల్ కోసం లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి చిక్కారు. ఈ సంఘటన జిల్లా పోలీస్ శాఖలో కలకలం సృష్టించింది. వరుస సంఘటనలతో పోలీసులూ ఇబ్బంది పడుతున్నారు.

ఫిర్యాదుదారునూ వదలట్లేదు..

వివిధ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇప్పించే అవకాశం ఉండడంతో కొందరు పోలీస్ అధికారులు దానిని తమకు అనుకూలంగా మలచుకున్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల ఫిర్యాదుదారు నుంచి కూడా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చాలా కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భంలో కేసుకో ధర కడుతున్నారు. చిన్నచిన్న కేసుల్లోనూ అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అడిగినంత ఇవ్వకుంటే రోజుల తరబడి తిప్పుకోవడం పరిపాటిగా మారింది. దీంతో ఏవైనా గొడవలు జరిగితే స్టేషన్‌కు వెళ్లాలంటేనే చాలా మంది జంకుతున్నారు.

సివిల్ తగాదాల్లో తలదూరుస్తూ..

జిల్లాలో కొందరు పోలీస్ అధికారులు సివిల్ తగాదాల్లోనూ తలదూరుస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు మరీ రెచ్చిపోతున్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ భూముల ధరలు పెరగడంతో వివాదాలూ పెరిగాయి. అందులో పోలీసు అధికారులు ఏదో ఒక పక్షానికి అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా ఒత్తిడి చేస్తున్నారు. దీంతో బాధితులు లబోదిబోమనే పరిస్థితి ఏర్పడుతోంది. కాగా పోస్టింగ్‌ల కోసం లీడర్లను ప్రసన్నం చేసుకున్న పోలీస్ అధికారులు.. తర్వాతా వాళ్లు చెప్పినట్టే నడుచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వాలు మారినా పోస్టింగ్‌లపై ఖద్దరు ముద్ర పోవడం లేదు. అధికారంలో ఎవరుంటే వారిని మచ్చిక చేసుకుని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతూ డబ్బులకోసం వేధిస్తున్న పోలీస్ అధికారులపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన ఎస్సై, రైటర్

- స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ. 10 వేలు లంచం తీసుకుంటూ లింగంపేట ఎస్సై పబ్బ అరుణ్, స్టేషన్ రైటర్ తోట రామస్వామి ఏసీబీకి పట్టుబడ్డారు. నిజామాబాద్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. లింగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండునెలల క్రితం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై అరుణ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని ఇటీవల అదుపులోకి తీసుకుని, ఎస్సై తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కేసులో స్టేషన్ బెయిల్ కోసం నిందితుడు ఇప్పటికే రూ. 30 వేలు ఇచ్చాడు. మరో రూ. 10 వేలు ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేయడంతో విసిగిపోయి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం రూ. 10 వేలు స్టేషన్ రైటర్ రామస్వామికి ఇస్తుండగా పట్టుకున్నారు. రైటర్‌ను విచారించగా ఎస్సై ఆదేశాల మేరకు డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించాడని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఎస్సై అరుణ్, రైటర్ రామస్వామిలపై కేసు నమోదు చేశామని, ఇరువురిని నాంపల్లిలోని ఏసీబీ కోర్టు ముందు హాజరు పరుస్తామని పేర్కొన్నారు. సదరు ఎస్సైపై అవినీతి ఆరోపణలున్నాయి. వివిధ కేసుల్లో నిందితుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అవినీతికి పాల్పడే ప్రభుత్వ అధికారులకు సంబంధించిన సమాచారాన్ని 1061 టోల్ ఫ్రీ నంబరుకు అందించాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఏసీబీ దాడిలో సీఐలు నగేశ్, శ్రీనివాస్, వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీకి చిక్కిన ఎస్సై, రైటర్



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న ఎస్పీ సింధు శర్మ, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్

లక్ష్యసాధనకు శ్రమించాలి

- ఎస్పీ సింధు శర్మ
- 'సాక్షి' ఆధ్వర్యంలో బాలసదనంలో ఘనంగా బాలల దినోత్సవం

కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: జీవితంలో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని సాధించే దిశగా శ్రమించాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలసదనంలో గురువారం 'సాక్షి' మీడియా గ్రూపు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ విక్టర్, జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో చందర్‌నాయక్, డీసీపీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. ఎస్పీ సింధు శర్మ పిల్లలతో మాట్లాడి పెద్దయ్యాక ఏమవుతారో తెలుసుకున్నారు. బాగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటలు, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. బాల సదనంలో ఆశ్రయం పొందుతున్న బాలికలు, సదనం వివరాలను డీసీపీవో స్రవంతి ఉన్నతాధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుని ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉండాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్, జెడ్పీ సీఈవో చందర్

కష్టాలకు కుంగిపోవద్దు

జీవితంలో ఎదురయ్యే కష్టాలకు కుంగిపోవద్దని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు. బాలికలను, మహిళలను గౌరవించాలన్నారు. చిన్న వయసు నుంచే బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణ, సభ్యురాలు స్వర్ణలత, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సాక్షి జిల్లా ప్రతినిధి వేణుగోపాలాచారి, రిపోర్టర్లు సురేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల నిరసన



అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్‌లకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: వికారాబాద్ కలెక్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ, టీఎన్జీవోస్, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్‌లకు వినతిపత్రం అందించారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తోపాటు కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, రాజారాం, గోవర్ధన్, చింతల లింగం, శ్రీశైలం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ తహసీల్దార్‌పై విచారణ

మాచారెడ్డి: పాల్వంచ తహసీల్దార్ జయంత్‌రెడ్డి వ్యవహారంపై కలెక్టర్ ఆదేశాలతో అదనపు కలెక్టర్ విక్టర్ గురువారం విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం పాల్వంచలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే కేవీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్ కార్యాలయంలో పనులు కావడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను ప్రశ్నించగా ఆయన 'ప్రింటర్ చెడిపోయింది. ఏం చేయమంటారు?' అంటూ నిర్లక్ష్యంగా బదులిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆగ్రహానికి లోనైన ఎమ్మెల్యే.. వెంటనే ఫోన్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విచారణ చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ విక్టర్‌ను ఆదేశించారు. విక్టర్ గురువారం పాల్వంచకు వచ్చి తహసీల్దార్‌పై విచారణ జరిపారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ జయంత్‌రెడ్డితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్‌ను బదిలీ చేయాలని రైతులు లిఖిత పూర్వకంగా కోరారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ బదిలీ అయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.



అదనపు కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు

'గ్రంథాలయాల ప్రాధాన్యత ఎనలేనిది'



సరస్వతిమాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి అర్బన్: జ్ఞాన వ్యాప్తిలో గ్రంథాలయాల పాత్ర ఎనలేనిదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థలో శ్రీసరస్వతి పూజ అనంతరం గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నవారు గ్రంథాలయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సూచించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే వివిధ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ ఉర్దొండ వనిత, కౌన్సిలర్ అనూష, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- లెవీ సేకరణ, ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్కన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: ధాన్యం సేకరణలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. లెవీ సేకరణ, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు జరపాలని సూచించారు. రైతులు రైస్ మిల్లుల వద్ద నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల వద్దనే వారికి సమగ్ర వివరాలతో కూడిన రసీదులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడ కూడా పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని, తప్పిదాలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డీఫాల్టర్లుగా లేని రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలని సూచించారు. ధాన్యం మిల్లింగ్ అయిన వెంటనే సివిల్ సప్లయిస్ గోడౌన్లకు తరలించాలన్నారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నందున ఒక్క బియ్యం గింజ కూడా చెడిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా మిల్లింగ్ జరిపి బియ్యం నిల్వలను తిరిగి అందించడంలో విఫలమైన మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. లెవీ లక్ష్యానికి విఘాతం కల్పించిన మిల్లర్లపై అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టును ప్రయోగించాలన్నారు. పది రోజుల్లోగా మరోసారి తాను ఇదే అంశంపై ప్రత్యేకంగా సమీక్ష జరుపుతానని, ఆ లోపు డీఫాల్ట్ మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లాలో గ్రూప్-3 పరీక్షలను సజావుగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, అబ్జర్వర్‌లు, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలకు తావు లేకుండా గ్రూప్-3 పరీక్షలను నిర్వహించాలన్నారు. ఎలాంటి ఆరోపణలకు అవకాశం లేకుండా తనిఖీలు, హాజరు నమోదు చేపట్టాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, మెడికల్ కిట్‌తోపాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిక్షణ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, రీజనల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, శిక్షకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

బాల్య వివాహం అడ్డగింత

బాన్సువాడ: బీర్కూర్ మండలం వీరాపూర్‌లో బాల్య వివాహాన్ని అధికారులు గురువారం అడ్డుకున్నారు. ఓ మైనర్ బాలికకు కుటుంబ సభ్యులు వివాహం చేసేందుకు సిద్ధం కాగా విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకొని బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాలికకు 18 ఏళ్లు నిండేవరకు పెళ్లి చేయవద్దని సూచించారు. ఒక వేళ బలవంతంగా పెళ్లి చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలికను కామారెడ్డి బాలసదన్‌కు తలరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ మోహన్, సీడీపీవో సౌభాగ్య, సూపర్‌వైజర్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

జల్దిపల్లిలో పశువైద్య శిబిరం

లింగంపేట: మండలంలోని జల్దిపల్లిలో గురువారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యురాలు హనా జోనస్ తెలిపారు. అలాగే లింగ నిర్ధారణ వీర్యం గురించి డాక్టర్ రవికుమార్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణ, గోపాలమిత్రలు ఎజాస్, రమేశ్, మల్లేశ్, వెంకట్, శివలాల్, పరంధాములు, పశుపోషకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

లింగంపేట: మండలంలోని అయిలాపూర్‌లో ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శౌకత్ అలీ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎంఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం దామోదర్, సిబ్బంది పద్మ, శివానంద్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

18న కార్మికసంఘం జిల్లా మహాసభ

నాగిరెడ్డిపేట: జిల్లాకేంద్రంలోని తాహెర్ గార్డెన్‌లో ఈ నెల 18న కార్మికసంఘం జిల్లా మహాసభను నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కో-కన్వీనర్ అబ్దుల్ రజాక్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం మండల కార్మిక సంఘం నాయకులు మల్కి పోచయ్య, కమలాకర్‌తో కలిసి మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ధ్యానబోయిన శ్యామ్, కుసులకంటి సాయిలు, మహ్మద్ షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెవాడలో బీటీ రోడ్డు కోసం సర్వే

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి బీటీ రోడ్డు కోసం అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. ఎల్లారెడ్డి పీడబ్ల్యూ రోడ్డు నుంచి రేపల్లెవాడ వరకు బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు కావడంతో అధికారులు సర్వే చేపట్టారు. త్వరలో గ్రామానికి బీటీ రోడ్డు వేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో సాకలి స్వామికి చెందిన దూడ కుక్కల దాడిలో గురువారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల పెద్ద గేదెను కొనుగోలు చేయగా దానికి మరో దూడ జన్మించింది. ఆ దూడపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుక్కల దాడిలో మృతి చెందిన గేదెకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: హుతాత్మా దివస్ సందర్భంగా ఎల్లారెడ్డి బజరంగ్‌దళ్ నాయకులు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్, నాయకులు విద్యాసాగర్, వినోద్, నవీన్, తులసి పాల్గొన్నారు.

ఏ దశలోనూ రైతులు నష్టపోవద్దు

- పకడ్బందీగా ధాన్యం సేకరణ
- అధికారుల సంతకాలతో రైతులకు రసీదులు
- తరుగు, కడ్తా పేరుతో కోతలు విధిస్తే చర్యలు తప్పవు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- మూడు నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో కొనుగోలు కేంద్రం బాధ్యులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి


ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌లో ట్రక్ షీట్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

డిచ్‌పల్లి/ఎడపల్లి/ఆర్మూర్/: రైతులు ఏ దశలోనూ మోసపోవద్దని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందని జిల్లా ఇన్‌చార్జి, ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి, ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌తోపాటు ఆర్మూర్ పట్టణంలో గురువారం ఆయన పర్యటించారు. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యం సేకరణ వివరాలను తెలుసుకున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని మంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏ గ్రేడ్' ధాన్యం క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.2320తో పాటు సన్నాలకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం చెల్లిస్తుందని, ఎటువంటి అనుమానాలకు తావివ్వొద్దని సూచించారు. ధాన్యం సేకరించిన వెంటనే రైతుకు చెల్లించనున్న మొత్తం డబ్బులు, బోనస్ తదితర వివరాలతో కూడిన రసీదును సంబంధిత అధికారి సంతకంతో అందజేయాలని ఆదేశించారు. తద్వారా రైతులు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండదని, కోతల పేరిట నష్టపోరని అన్నారు. ఎక్కడ కూడా తరుగు, కడ్తా పేరుతో కోతలు విధించకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి కేంద్రానికి ఒక అధికారిని నియమించాలని, అవసరమైతే ఇతర శాఖల అధికారుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, రైతుకు నష్టం చేకూర్చే చర్యలను ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులను అయోమయానికి గురి చేయొద్దని, వాస్తవాలు చూపాలని మీడియాకు సూచించారు. పంట మార్పిడితో భూమి సారవంతంగా ఉంటుందని, రైతులు ఆ దిశగా ఆలోచించాలని అన్నారు.

మంత్రి వెంట ఎమ్మెల్యేలు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, పైడి రాకేశ్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ వన్నెల్‌దేవి లావణ్య, మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, నాయకులు శేఖర్‌గౌడ్, నగేశ్‌రెడ్డి, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, అమానుల్లా, అమృతాపూర్ గంగాధర్, సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏవో సుధామాధురి, రైతులు ఉన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన


మెంట్రాజ్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్ పల్లిలో అధికారులు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను మంత్రి పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాల వారికి సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకే సర్వే చేయిస్తోందన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో మంత్రి రైతులతో భేటీ అయ్యారు.

అప్పుల భారమున్నా..


ఆర్మూర్ పట్టణం మామిడిపల్లిలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఆర్మూర్/డిచ్‌పల్లి: గత ప్రభుత్వం చేసిన అప్పుల భారంతో రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్ పట్టణం మామిడిపల్లిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రం భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు రూ.60 వేల కోట్ల అప్పులు మాత్రమే చేయగా, గత ప్రభుత్వం పదేళ్ల పాలనలోనే రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. ఈ అప్పులపై వడ్డీ రూపంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రతి నెలా రూ. 6వేల కోట్లు చెల్లిస్తోందని తెలిపారు. ఇలా తీవ్రమైన ఆర్థిక భారం ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రూ.500 లకు వంట గ్యాస్, రైతులకు పంట రుణాల మాఫీ తదితర వాటన్నింటిని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ అర్హులైన రైతులకు రైతు భరోసా కింద తప్పనిసరిగా లబ్ధి చేకూరుస్తామని స్పష్టం చేశారు. సుమారు రూ. 20 వేల కోట్లను వెచ్చిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 గృహాలను ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలనే కుట్రతో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు.

సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


హైదరాబాద్‌లో అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ: నియోజకవర్గంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బాన్సువాడ నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉందని, నియోజకవర్గంలో 70,760 కుటుంబాలు ఉన్నాయని, అందులో 66,670 మంది రైతులు ఉన్నారని అన్నారు. భవిష్యత్తులో సిద్ధాపూర్ రిజర్వాయర్ ఆయకట్టు సస్యశ్యామలంగా ఉండాలనేది తన ఉద్దేశ్యమని అన్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రిజర్వాయర్ నిర్మిస్తున్నామని, ఒక టీఎంసీ కెపాసిటీతో రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. రిజర్వాయర్ కట్టతో పాటు కుడి, ఎడమ కాలువల పనులు త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. గిరిజనులు, మెట్ట ప్రాంత రైతులకు సాగు నీరు అందించాలని కష్టపడి సిద్ధాపూర్ రిజర్వాయర్ కట్టిస్తున్నామని అన్నారు.

ఆన్‌లైన్‌లో 'వేలం' వాహనాల వివరాలు

కామారెడ్డి క్రైం: వేలం వేసే వాహనాల వివరాలను జిల్లా పోలీస్ శాఖకు చెందిన ట్విట్టర్ అకౌంట్, ఫేస్‌బుక్‌లో పొందుపర్చినట్లు ఎస్పీ సింధుశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో కాలంగా పోలీస్ శాఖ ఆధీనంలో ఉన్న 79 మోటారు వాహనాలు, బైక్‌లతోపాటు ఇతర సామగ్రిని వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. చట్ట ప్రకారం సరైన పత్రాలు చూపి వాహనాల యజమానులు వాటిని తీసుకెళ్లొచ్చని, లేనిపక్షంలో వేలం వేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 87126 86114 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోస్టాఫీస్ సిబ్బంది నిర్బంధం



ఎల్లారెడ్డి: ఉపాధిహామీ డబ్బుల చెల్లింపులో పోస్టాఫీస్ అధికారుల వేధింపులు తాళలేక సిబ్బందిని నిర్బంధించిన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి మండలంలోని జిత్యానాయక్ తండాకు చెందిన రాందాస్ గత మూడేళ్ళ క్రితం మృతి చెందగా అతడికి సంబంధించిన ఉపాధిహామీ డబ్బుల ను ఇవ్వాలని మృతుడి తండ్రి కమల్‌నాయక్ పోస్టాఫీస్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. అధికారులకు డాక్యుమెంట్లు అన్ని సమర్పించినప్పటికీ గత ఆరు నెలలుగా అతడిని తిప్పుకుంటుండడంతోపాటు టెక్నికల్ సమస్య ఉందని, డబ్బులు చెల్లించడానికి కొంత మొత్తం ఇవ్వాలని ఇబ్బంది పెట్టడంతో విసిగి పోయిన కమల్ నాయక్ గురువారం అధికారులు లోపల ఉండగా పోస్టాఫీస్‌కు బయట నుంచి తాళం వేశాడు. ఈవిషయమై ఎస్‌పీఎంను అంబర్‌సింగ్‌ను అడగగా కమల్‌నాయక్‌కు సర్వర్ సమస్య ఉందని సోమవారం వచ్చి డబ్బులు తీసుకోవాలని చెప్పినా వినకుండా తాళం వేసి నిర్బంధించారన్నారు.

ఘనంగా సహకార దినోత్సవం


తిప్పాపూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి


రాజంపేటలో చైర్మన్ నల్లవెల్లి అశోక్

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని అన్ని గ్రామాల్లో సహకార దినోత్సవ వేడుకలను సొసైటీ చైర్మన్లు, సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయాల ఎదుట సహకార జెండాలను ఎగురవేశారు. రైతుల సేవల కోసమే సహకార సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు చైర్మన్లు పేర్కొన్నారు. సహకార సంఘాల ద్వారా అందుతున్న సేవలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


పిట్లంలో చైర్మన్ శప్థంరెడ్డి


లింగంపేటలో చైర్మన్ దేవేందర్‌రెడ్డి

ఆధ్యాత్మికం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


నాగిరెడ్డిపేట: ధర్మారెడ్డిలో హోమం చేస్తున్న భక్తులు


మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో..


మద్నూర్ మల్లేశ్వర ఆలయంలో..

సాక్షి నెట్‌వర్క్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నాగిరెడ్డిపేట, నస్రుల్లాబాద్, మద్నూర్, తాడ్వాయి, కామారెడ్డి, మాచారెడ్డి, పలు మండలాల్లోని ఆలయాల్లో భక్తులు ఆకాశదీపోత్సవం నిర్వహించారు. పలు ఆలయాల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

నేడు శబరిమాత ఆశ్రమంలో వేడుకలు

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వేడుకలకు భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన కార్తీక దీపాలు

మాచారెడ్డి: మండలంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి శంఖు, చక్రాదులు కార్తీక దీపాలు అందరినీ అలరించాయి.


మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో..


కామారెడ్డి సరస్వతి ఆలయంలో..

గ్రూప్-4 ఫలితాల్లో బస్వాపూర్ యువకుల ప్రతిభ


గంగదారి రంజిత్


మన్నె నవీన్

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గ్రూప్-4 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకులను సాధించారు. గురువారం ప్రకటించిన ఫలితాల్లో గంగదారి రంజిత్ జిల్లా స్థాయిలో 21వ ర్యాంకు, మన్నె నవీన్ 48వ ర్యాంక్ సాధించారు. నవీన్ గతేడాది పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాడు. రంజిత్, నవీన్ గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని హత్య

- బాన్సువాడలో వృద్ధుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

బాన్సువాడ : పట్టణంలోని ఈనెల 11వ తేదీన అర్ధరాత్రి జరిగిన వాచ్‌మెన్ వెంకట్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. సీఐ అశోక్ కేసుకు సంబంధించిన వివరాలు గురువారం వెల్లడించారు. పాత బాన్సువాడకు చెందిన వెంకట్ అనే వ్యక్తి సరస్వతి మందిరం సమీపం నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మరో వాచ్‌మెన్ పోల్కం వీరయ్య వద్ద వెంకట్ చేబదులుగా రూ.25వేలు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగివ్వాలని వీరయ్య పలుమార్లు వెంకట్‌ను కోరినప్పటికీ అతడు ఇవ్వకపోవడంతో 11వ తేదీ అర్ధరాత్రి నిర్మాణంలో ఉన్న భవనంలో నిద్రిస్తున్న వెంకట్‌పై వీరయ్య గొడ్డలితో దాడి చేశాడు. గొంతు, తలు, ఎడచేయిపై నరకడంతో వెంకట్ అక్కడికక్కడే మృతి చెందాడు. 12వ తేదీన ఉదయం ఏమీ తెలియని వాడిలా వెంకట్‌ను ఎవరో చంపేశారని ఇంటి యజమానికి, చుట్టు పక్కల వారికి చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నం చేశాడు. పోలీసులు వీరయ్యను విచారించగా, తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో హత్య చేశానని అంగీకరించాడు. వీరయ్యను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. హత్య కేసును ఛేదించిన హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్, సిబ్బంది అశోక్, హేమాంద్రిని సీఐ అభినందించారు.

నలుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఆయుధాలతో బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. రుద్రారం గ్రామానికి చెందిన గూడ అరవింద్ మోడల్ స్కూల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడే ఉన్న కళాశాల విద్యార్థులు మహేశ్, కాచర్ల చరణ్, మేదరి చరణ్ కలిసి అరవింద్‌ను అక్కడి నుంచి పంపించారని ఎస్సై అన్నారు. ఇది మనసులో పెట్టుకున్న అరవింద్ తన స్నేహితులైన ప్రసాద్, ఇర్ఫాన్, తాజుద్దీన్‌తో కలిసి గొడ్డలి, సైకిల్ రింగ్ వెంట తీసుకువచ్చి మరోసారి తమ జోలికి వస్తే చంపేస్తామని మోడల్ కళాశాల విద్యార్థులను బెదిరించారు. మహేశ్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అల్ప్రాజోలం పట్టివేత

- నిందితుల రిమాండ్, సెల్‌ఫోన్లు, కారు సీజ్



దోమకొండ: మండలంలోని అంచనూరు గ్రామంలో ఉన్న కల్లుడిపోపై పోలీసులు గురువారం దాడి చేసి నిషేధిత అల్ప్రాజోలంను పట్టుకున్నారు. కల్తీ కల్లు తయారు చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, దోమకొండ ఎస్సై ఆంజనేయులు డిపోపై దాడి చేసి 50 గ్రాముల అల్ప్రాజోలంతోపాటు 100 గ్రాముల ఇతర రసాయనాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకులు సిద్దాగౌడ్, నారాగౌడ్, బాబాగౌడ్‌ను అరెస్ట్ చేశారు. వీరికి అల్ప్రాజోలం సరఫరా చేసిన వెంకటరమణ్‌గౌడ్‌ను సైతం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఓ కారుతో పాటు సెలఫోన్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని సైకిలిస్ట్ మృతి

భిక్కనూరు: మండల కేంద్రంలోని పైలాన్ సమీపంలో సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో నీల ఇస్తారి(58) అనే వ్యక్తి మృతి చెందాడు. ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ సైకిల్‌పై వెళ్తున్న ఇస్తారిని ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ట్రాక్టర్ డ్రైవర్‌ను పట్టుకుని చితకబాదారు. సమాచారం అందుకున్న ఎస్సై సాయికుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య సత్తవ్వ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఆటో స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గోదాం రోడ్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందిరానగర్ కాలనీకి చెందిన ఇరగదిండ్ల అంజయ్య, రాజు కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఇద్దరిని స్థానికులు వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

పేకాటస్థావరంపై దాడి

రాజంపేట: మండలంలోలోని కొండాపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాటస్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని నగదు, మొబైల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. కానిస్టేబుళ్లు రమేశ్, బాలు, భాస్కర్, రవీందర్ ఉన్నారు.